క్లుప్తంగా

జేసీ ఇలక్కియకు శుభాకాంక్షలు



ఆనంద నిలయం చిన్నారులతో జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియను కాకినాడ ఆనంద నిలయం చిన్నారులు ఆదివారం కలుసుకున్నారు. ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో సత్వరం పరిష్కరించుకోవచ్చని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం కమలాదేవి మాట్లాడుతూ చిన్న తగాదాల కారణంగా కేసులు పెట్టుకుని డబ్బును, మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఇరువర్గాల పట్టుదలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడం ద్వారా స్నేహపూర్వక బంధం ఏర్పడుతుందన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసుడు కృష్ణమాచార్యులు తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం వేడుకలను సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులచే గాత్ర సంగీత కచేరీ నిర్వహించారు. అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు, ముత్తుస్వామి దీక్షితార్ తదితర ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలు వివిధ రాగాలలో ఆలపించి అలరించారు. యువవాహిని సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. సభ్యులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ, కుంజుక లక్ష్మి, తురుగా సూర్యారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే సంతృప్తి



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేస్తున్న బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: దివ్యాంగులకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ మనం ద్వారా సెయింట్ తొమస్ సీఎస్ఐ చర్చి వద్ద ఆదివారం పేద దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో మహిళలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. లయన్ ఆర్‌సీ నాగలక్ష్మి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ జె.మధురవాణి, క్లబ్ అధ్యక్షులు సుజాత, కోశాధికారి వీణా, కాకినాడ సర్కిల్ డీసీటీఓ కె.విజయానంద్, డాక్టర్ తేజ, పద్మతులసి, దంగేటి సతీష్ పాల్గొన్నారు.

టూ టౌన్ సీఐగా నాయక్ బాధ్యతల స్వీకరణ



నాగేశ్వరనాయక్‌కు బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలుపుతున్న రామచంద్రరావు

కాకినాడ క్రైం: స్థానిక టూ టౌన్ సీఐగా బి.నాగేశ్వర్ నాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన నాయక్ పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, నల్లజర్లలో పనిచేశారు. పదోన్నతిపై భీమడోలు సీఐగా బాధ్యతలు చేపట్టి ముమ్మిడివరం, జంగారెడ్డిగూడెంలలో పనిచేశారు. గత ఏడాది జనవరి 30న కాకినాడ ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు. తాజా సాధారణ బదిలీలలో సీఐ నాయక్ కాకినాడ టూ టౌన్‌కు వేశారు. ఇప్పటి వరకూ టూ టౌన్ సీఐగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రరావు రేంజ్ వీఆర్‌గా ఏలూరులో రిపోర్టు చేయనున్నారు.

విజయమే మన అజెండా

- ప్రతి ఇంటా ఎగరాలి వైఎస్సార్ సీపీ జెండా
- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పిలుపు



పార్టీ కేడర్‌కు వైఎస్సార్ సీపీ జెండాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న

కాకినాడ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే అజెండాగా శ్రేణులు ముందుకు సాగాలని, మన మద్దతుదారుల ఇళ్లపై పార్టీ జెండాలు ఎగురవేద్దామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఆయన నివాసం వద్ద నూతన సంవత్సర సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులకు పెద్ద ఎత్తున పార్టీ జెండాలు అందజేశారు. వివిధ డివిజన్ల నుంచి వచ్చిన కేడర్‌కు ఆయన జెండాలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి కార్యకర్త పార్టీ కోసం మరింత కష్టించి పని చేయాలని అన్నారు. మరో ఏడాది తరువాత ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి నిత్యం ప్రజల మధ్యే ఉంటూ మమేకం కావాలని కోరారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వంపై బురద జల్లుతున్న ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రతి ఇంటిపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా శ్రమిద్దామన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధికి ముగ్గురేసి కన్వీనర్లతో పాటు ప్రతి వలంటీర్ పరిధిలో ఇద్దరు చొప్పున సంక్షేమ సారథులను నియమిస్తున్నామన్నారు. వీరందరిపై ఎంతో కీలక బాధ్యత ఉందన్నారు.

సందడే.. సందడి

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి వద్ద నూతన సంవత్సర సందడి నెలకొంది. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివ ప్రసన్నతో పాటు పలువురు నేతలు, అధికారులు ఎమ్మెల్యేను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు ఎమ్మెల్యేను కలిశారు. న్యూ ఇయర్ సందర్భంగా బొకేలు, పూల దండలు తేవొద్దన్న ద్వారంపూడి పిలుపు మేరకు ఆయనను కలిసేందుకు వచ్చిన పలువురు పేద విద్యార్థుల కోసం పుస్తకాలు, పెన్నులు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆయన ఇంటి వద్ద కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీ వంగా గీత, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబును కూడా కలుసుకుని న్యూ ఇయర్ విషెష్ తెలియజేశారు.



ఎంపీ వంగా గీతకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి



ఏపీ ఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను ఏపీ ఎన్జీవో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ముద్రించిన టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, కాకినాడ జిల్లా ప్రతినిధులు గుద్దటి రామమోహన్, పేపకాయల వెంకటకృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ల చంద్రరావు, అజీజ్, సత్తిరాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి నామ సంవత్సరంగా నిలవాలి



కాకినాడలో ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కరప మండల నాయకులు, అధికారులు



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రమణయ్యపేటలో వేడుకలు

కాకినాడ రూరల్: నూతన సంవత్సరం అభివృద్ధి నామ సంవత్సరంగా నిలవాలని, ప్రజలకు ప్రతి పనిలో విజయాన్ని అందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆకాంక్షించారు. ఆదివారం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు భారీగా తరలివచ్చారు. అభిమానుల సమక్షంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసిన కన్నబాబు వారికి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, పూల దండలు, గజమాలలు, పండ్లు, స్వీట్లు, కేక్‌లను తీసుకుచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలకు నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని కోరారు. కన్నబాబుతో పాటు ఆయన తండ్రి నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సోదరుడు, సినీ దర్శకుడు కళ్యాణ్ కృష్ణకు శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కన్నబాబుకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వికాస పీడీ లచ్చారావు, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరావు, కాకినాడ కార్పొరేషన్ ఏడీసీ నాగనరసింహారావు, ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, దీపక్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు దున్నా జనార్దనరావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, గీసాల శ్రీను తదితరులు ఉన్నారు.

కన్నబాబు ఇంట విందు

కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ శాఖల సిబ్బందికి ఎమ్మెల్యే కన్నబాబు న్యూ ఇయర్ విందు ఇచ్చారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం చికెన్ బిర్యాని, చికెన్ కర్రీ, స్రాన్ ఫిట్, చేప పిలుసు, తదితర రుచికరమైన వంటకాలను క్యాంపు కార్యాలయం వద్ద తయారు చేయించి సాయంత్రం వడ్డించే ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే వలసపాకలలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, కొవ్వాడలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ బాబ్జీ దంపతులు సంబరాలు జరుపుకొన్నారు.

కరప: మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అధికారులు కాకినాడకు తరలివెళ్లి ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు ఉన్నారు. అలాగే టీడీపీ నాయకులు కాకినాడలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

పింఛన్... పెంచెన్

- హామీ నెరవేర్చిన సీఎం జగన్
- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి



పెరిగిన పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

కాకినాడ: ఇచ్చిన హామీకి కట్టుబడి పింఛను సొమ్మును పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక 4వ డివిజన్లో పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడో విడత పింఛన్ సొమ్మును రూ.2,750కు పెంచి లబ్ధిదారులకు ప్రభుత్వం మేలు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ అమలు చేస్తున్నారని, ఇందులో భాగంగా పింఛన్ల సొమ్ము కూడా మూడో విడత ఈ నెల నుంచి పెంచారన్నారు. పింఛన్లు తీసుకునే ప్రతి లబ్ధిదారునికి నూతన సంవత్సరం తొలిరోజు ఓ పండగలా మారిందన్నారు. అలాగే ఈ నెల 4న నగరంలో కొత్తగా మరో 1,600 మందికి పింఛన్లు అందజేస్తామని అన్నారు. కొత్తగా ఎంపిక చేసిన సచివాలయ కన్వీనర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొని టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, రాగిరెడ్డి బన్ని, పలకా సూర్యకుమారి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల మోములో చిద్విలాసం



కాకినాడ రూరల్ గైగోలుపాడులో పింఛన్ల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులకు న్యూ ఇయర్ వేళ పెరిగిన సొమ్ముతో మోములో చిద్విలాసం కనిపించింది. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును పెంచుతూ కొత్త సంవత్సరంలో రూ.2,750 చొప్పున అందిస్తుండడంతో అంతా ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీని ఆదివారం వేకువజాము నుంచే వలంటీర్లు ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 31,838 మంది పింఛన్లు పొందుతుండగా కొత్తగా 1,276 మంజూరయ్యాయి. జనవరి నుంచి పింఛన్ సొమ్మును రూ.2,750 చొప్పున ప్రభుత్వం పెంచింది. దీనిద్వారా నియోజకవర్గంలో మొత్తం లబ్ధిదారులకు రూ.9.16 కోట్లు అందించనున్నారు. రమణయ్యపేట గైగోలుపాడులో పెంచిన వైఎస్సార్ పింఛను కానుకను ఎమ్మెల్యే ప్రారంభించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు పింఛన్ సొమ్మును ఎమ్మెల్యే కన్నబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వా తాతలకు న్యూ ఇయర్ వేళ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న కానుక ఇది అన్నారు. ప్రతి ఇంటా వెలుగులు నింపాలని పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. డీఎల్‌డీఓ నారాయణరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సత్తిబాబు, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబు

ఇంటికి వెళ్లి.. పింఛను ఇచ్చి..



వలసపాకలలో వృద్ధురాలు నేళ్ల నాగమ్మకు పింఛను ఇస్తున్న వలంటీర్ కొమరపు వీరప్రసాద్

కరప: వేకువనే ఇంటికెళ్లి పెంచిన పింఛను సొమ్ము ఇవ్వడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కరప మండలంలో 11,524 మందికి పింఛన్ల కింద రూ.3,14,52,500 ఇస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ గుత్తుల భీమశంకరరావు తెలిపారు. ఈ నెల నుంచి కొత్తగా 367 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. తొలిరోజు ఆదివారం 66.43 శాతం పంపిణీ జరిగిందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ భీమశంకరరావు, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో పంపిణీ చేపట్టారు. గొర్రిపూడి–2 సచివాలయం పరిధిలో 81.72 శాతం, పెనుగుదురు–2 సచివాలయంలో 80.36 శాతం, గురజనాపల్లి సచివాలయం పరిధిలో 79.06 శాతంతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి.

హ్యాపీ.. హ్యాపీగా..

నగరంలో నూతన సంవత్సర సందడి



భానుగుడి సెంటర్‌లో పూల బొకేలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కాకినాడ కల్చరల్: హ్యాపీ.. హ్యాపీగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అంతా సంబరాలు జరుపుకొన్నారు.. నగరంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఈ వేడుకలు అంబరాన్నంటాయి. కొంగొత్త ఆశలతో ప్రతి ఒక్కరూ సందడి చేశారు.. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నారులు గ్రీటింగ్స్, పలువురు బొకేలు, యువత సోషల్ మీడియా ద్వారా శుభాభినందనలు తెలుపుకొన్నారు. ప్రతి ఇంటా రంగు రంగుల రంగవల్లులు ముచ్చట గొలిపాయి. రెండేళ్ల పాటు కరోనా నిబంధనలతో నూతన సంవత్సర వేడుకలకు దూరమైన ప్రజలు ప్రస్తుతం ఎంతో ఉత్సాహంగా జరుపుకొన్నారు. గృహిణులు తమ ఇంటి ముంగిట రంగవల్లులతో 2023 సంవత్సరానికి స్వాగతం పలికారు. నగరంలో స్వీట్స్, డ్రైఫ్రూట్స్, పూల దుకాణాలు కిటకిటలాడాయి. భానుగుడి, సర్పవరం తదితర ప్రాంతాలలో మొక్కల విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేశారు. పర్యావరణ ప్రేమికులు పలువురికి మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనుబంధాలను బలపరిచేదే రామాయణం



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్

కాకినాడ కల్చరల్: భార్యాభర్తల అనుబంధాన్ని బలపర్చే మహా గ్రంథమే రామాయణమని సాహితీవేత్త గొట్టుముక్కల నరసింహశాస్త్రి అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో సాంస్కృతిక, కళారంగ ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రామాయణంపై ప్రసంగ సభ జరిగింది. సుందరకాండపై గొట్టుముక్కల ప్రసంగించారు. సమాజంలో దంపతులు ఏవిధంగా ఉండాలో రామాయణం మనకు చెబుతోందని సభకు అధ్యక్షత వహించిన వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ అన్నారు. అనంతరం విద్యార్థులకు సుందరకాండపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ దంపతులను ఎంపిక చేసి వారికి ఆదర్శ దంపతుల పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా గంటి విశ్వనాథం, రాణీ బాలాత్రిపుర సుందరీ హాజరు కాగా ఆస్వాదన సమితి కన్వీనర్ గౌరీనాయుడు, మాకినీడి సూర్యభాస్కర్, శారద, ఉద్గళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహిని అలంకరణలో సీతారామస్వామి



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామివారు

బోట్‌క్లబ్: రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆదివారం భక్తులకు జగన్మోహిని అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి జగన్మోహిని అలంకరణ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: స్థానిక జెడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో పీఆర్‌టీయూ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదివారం ఆవిష్కరించారు. తొలుత ఆయనకు అసోసియేషన్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు చింతాడ ప్రదీప్‌కుమార్, ఏడుకొండలు, వాసంశెట్టి కామేశ్వరరావు, సింహాద్రి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్



పోటీలలో పాల్గొనే జట్లకు డ్రా తీస్తున్న సీఏకే అధ్యక్షుడు మధువీరేష్

కరప: సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 7 నుంచి నిర్వహిస్తామని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సీఏకే) అధ్యక్షుడు దేవు మధువీరేష్ తెలిపారు. ఆదివారం కరపలో ఆయన మాట్లాడుతూ యాళ్ల వెంకట్రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 7వ తేదీ నుంచి నాకౌట్ విధానంలో పోటీలు జరుగుతాయన్నారు. దీనిలో మొదటి రెండు స్థానాలలో నిలిచే జట్లు మెయిన్ టోర్నీకి అర్హత సాధించి, ఆరు జట్లతో కలసి ఫైనల్ పోటీలలో తలపడతాయన్నారు. నాకౌట్ పోటీలు నక్కా భాస్కరమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామన్నారు. దేవు సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) జ్ఞాపకార్థం రూ 2 లక్షల విలువ చేసే గోల్డ్‌కప్ రోలింగ్ ట్రోఫీని విజేత జట్టుకు అందజేస్తామని సీఏకే అధ్యక్షుడు మధువీరేష్ తెలిపారు. టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించి, పోటీలలో పాల్గొనే జట్లకు డ్రా తీసి, ఆయన వివరాలను వెల్లడించారు. నిర్వాహకులు నక్కా భీమ్, పోలిశెట్టి వాసు, శాకా శ్రీనివాస్, అడపా శ్రీనివాస్, పేకేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల క్యూ

బోట్‌క్లబ్: నూతన సంవత్సరం కావడంతో ఆదివారం నగరంలో పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ధనుర్మాసం కావడంతో విష్ణాలయాలతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ నెలకొంది. జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. వెంకటనగర్‌లో వేంకటేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డులో సీతారామస్వామి, దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

టీటీడీ పాస్‌లు పునరుద్ధరించాలి



సమావేశంలో పాల్గొన్న ఫైబర్‌నెట్ ఆపరేటర్ల ఫెడరేషన్ నాయకులు

కాకినాడ క్రైం: కోవిడ్ కారణంగా నిలిపివేసిన కేబుల్ ఆపరేటర్ల టీటీడీ పాస్‌లను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర ఫైబర్ నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ సంఘ నాయకులు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి లేఖ రాశారు. ఈ మేరకు ఆదివారం కాకినాడ వెంకటనగర్ సంఘ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు మైసాల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కృష్ణమూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి ద్వారంపూడి అర్జున్‌రెడ్డి మాట్లాడారు. శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రసారాలను నిరాటంకంగా కోట్లాది ప్రజానికి అందిస్తున్న కేబుల్ ఆపరేటర్ల కోసం టీటీడీ గతంలో ప్రత్యేక దర్శన పాస్‌లను కేటాయించిందన్నారు. దీనిని తిరిగి పునరుద్ధరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, సురవరపు శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పర్యటన

బాలాజీచెరువు: జనసేన పార్టీ మా ప్రాంతం, మా సచివాలయం సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక 43బి వార్డు సచివాలయ పరిధి కుటుంబాలను ఆ నాయకులు కలుసుకున్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నగర అధ్యక్షుడు సంగిశెట్టి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య, మున్నా, మహేష్ పాల్గొన్నారు.

దేవుని కృపతోనే సమాజ శాంతి

పెద్దాపురం: దేవుని కృపతోనే సమాజ శాంతి సాధ్యమని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు పాస్టర్ రెవరెండ్ నంగిన సత్యానందం అన్నారు. క్రీస్తు ఆరాధనల్లో భాగంగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఆదివారం దివిలిలో ప్రేమవిందు ఆరాధన జరిగింది. ఈ సందర్భంగా క్రిష్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన సభలో సత్యానందం మాట్లాడారు. ప్రభువు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థనలు చేయాలన్నారు. అనంతరం సుమారు 1,500 మందికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు.